రోడ్లపైనే తోపుడుబండ్ల వ్యాపారాలు

- బస్టాప్‌నూ వదలని వ్యాపారులు
- సగం వరకు రోడ్డు ఆక్రమణతో వాహనదారులకు ఇక్కట్లు
- పలుమార్లు తొలగించిన ట్రాఫిక్ అధికారులు
- కొన్ని రోజులకే తిరిగి ఏర్పాటు



ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రి వద్ద రోడ్డుపై సగం వరకు ఆక్రమించిన తోపుడుబండ్ల వ్యాపారులు

ఎర్రగడ్డ, మే 5(ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ జాతీయ రహదారిలో దాదాపు అరకిలోమీటరు మేర రోడ్డు సగం వరకు ఏర్పాటు చేసిన తోపుడుబండ్ల మూలంగా వాహనదారులు ప్రతీ రోజు నిత్యం ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్నారు.

ఈఎస్ఐ నుంచి మూసాపేట వెళ్లే ప్రాంతంలో ఎడమవైపున ఉండే తోపుడుబండ్ల వల్ల ఎక్కువసార్లు ట్రాఫిక్‌జామ్ అవుతోంది. ఈఎస్ఐ ప్రాంతంలోని శ్రీ విజయలక్ష్మి ఆలయం నుంచి ఈఎస్ఐ బస్టాప్, ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రి, రైతుబజార్, ఎర్రగడ్డ రిజిస్ట్రేషన్ కార్యాలయం, డెక్కన్ హోటల్, సన్మాన్ హోటల్, గోకుల్ థియేటర్ మీదుగా దాదాపు ఎర్రగడ్డ వరకు జాతీయ రహదారిపై నిత్యం తోపుడుబండ్లు దర్శనమిస్తున్నాయి. శని, ఆదివారాల్లో అయితే వాహనదారులు నరక యాతన అనుభవిస్తున్నారు. సాయంత్రం వేళల్లో వాహనాలు ముందుకు కదలడమే గగనమైపోతోంది. వ్యాపారులు ఫుట్‌పాత్‌లను దాటి రోడ్డు సగం వరకు ఆక్రమించి తోపుడుబండ్లను ఏర్పాటు చేస్తుండడం వల్ల వాహనదారులు కదలలేని పరిస్థితి నెలకొంది.



సన్మాన్ హోటల్ వద్ద రోడ్డు మధ్యలో తోపుడుబండ్లు



ఈఎస్ఐ బస్టాప్ వద్ద తోపుడుబండ్లు



గోకుల్ థియేటర్ సమీపంలో తోపుడుబండ్లు



ఎర్రగడ్డ రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలో రోడ్డుపైనే తోపుడుబండ్ల వ్యాపారాలు

బస్టాప్ సైతం ఆక్రమణ



రైతుబజార్ వద్ద రోడ్డుపైనే వ్యాపారాలు

ఎర్రగడ్డ రైతుబజార్ వద్ద బస్టాప్‌ను సైతం ఆక్రమించి తోపుడుబండ్లను ఏర్పాటు చేయడం వల్ల ఆర్టీసీ ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. బస్టాప్‌లో నిలబడడానికి చోటులేక బస్సుల కోసం రోడ్డుపైనే నిలబడి ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. ట్రాఫిక్ అధికారులు పలుమార్లు తోపుడుబండ్లను తొలగించినా కొన్ని రోజులకే అవి తిరిగి మళ్లీ దర్శనమిస్తున్నాయి. సమస్యను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు కృషి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



ఎమ్మెల్సీగా ఎన్నికైన మీర్జా రియాజ్ ఉల్ హసన్‌ను అభినందిస్తున్న ఎంఐఎం సోమాజిగూడ డివిజన్ నాయకులు జాఫర్, మహ్మద్ అజర్, అన్వర్, వై.నగేష్ తదితరులు

● బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి

బేగంపేట డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్



శ్రీనివాస్

బేగంపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన మధుసూదన్‌రెడ్డిని నగరంలోని వారాసిగూడ ఎస్‌హెచ్‌ఓగా బదిలీ చేశారు.



హెచ్ఎఫ్‌నగర్ బస్తీలో భోజనం చేస్తున్న రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి

సన్నబియ్యం పథకంతో పేదల జీవితాల్లో వెలుగులు

బోరబండ, మే 5 (ఆంధ్రజ్యోతి): సన్నబియ్యం పథకంతో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి పేర్కొన్నారు. రహ్మత్‌నగర్ డివిజన్ హబీబ్ ఫాతిమానగర్‌లోని సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి సోమవారం ఆయన భోజనం చేశారు. కాగా, వినాయకనగర్‌కు చెందిన మణెమ్మకు రూ.40 వేలు, కార్మికనగర్‌కు చెందిన కుల్సుమ్‌బీకి రూ.60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను రహ్మత్‌నగర్ క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్ అందజేశారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా తెలంగాణ పోలీస్ రియల్ హీరోస్ జీ అవార్డు-2025 అందుకుంటున్న పశ్చిమ మండలం ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్

● బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి

ఎఫ్ఎన్‌సీసీలో వ్యాపారాల వల్ల ప్రభుత్వానికి నష్టం

- ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న రమేష్

బంజారాహిల్స్, మే 5 (ఆంధ్రజ్యోతి): సేవ పేరిట ప్రభుత్వం వద్ద అతి తక్కువ ధరకు లీజుకు తీసుకొని వ్యాపారాలు చేస్తూ ప్రజా ఖజానాకు తూట్లు పొడుస్తున్న ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌పై అధికారులు దృష్టి సారించాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ నాయకుడు కాటూరి రమేష్ తదితరులు ఫిర్యాదు చేశారు. సేవా, కమ్యూనిటీపరమైన కార్యక్రమాలు, సినీరంగ శిక్షణ కేంద్రం నెలకొల్పేందుకు నెలకు రూ.5 వేల చొప్పున ఎఫ్ఎన్‌సీసీని ఫిలింనగర్ సొసైటీ నిర్వాహకులు 30 సంవత్సరాలపాటు లీజుకు తీసుకున్నారని గుర్తు చేశారు. జీ ప్లస్ రెండు ఫ్లోర్ల నిర్మాణం కింద అనుమతి తీసుకొని మరో రెండు ఫ్లోర్లు అక్రమంగా నిర్మించారని, ఈ విషయంపై జీహెచ్ఎంసీ గతంలో నోటీసు జారీ చేసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సొసైటీ కింది కోర్టుకు వెళ్లగా జీహెచ్ఎంసీకి అనుకూలంగా తీర్పునిచ్చిందని ప్రస్తుతం ఈ అంశం హైకోర్టులో ఉందని తెలిపారు. ఈ నాలుగు అంతస్తుల్లో బారు, బ్యాంకెట్ హాల్, కాఫీ షాపులు నిర్వహిస్తూ ప్రభుత్వానికి చెల్లించే పన్నును ఎగ్గొడుతున్నారని వారు ఆరోపించారు. ఎఫ్ఎన్‌సీసీ భవనం విషయంలో అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, పన్ను వ్యవహారంపై విచారణ చేయాలని వారు డిమాండ్ చేశారు.



అనిల్‌కుమార్ యాదవ్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఎర్రగడ్డ డివిజన్ సమస్యలను పరిష్కరించాలి

ఎర్రగడ్డ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ డివిజన్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాజ్యసభసభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్‌కు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యాదగిరి యాదవ్ సోమవారం వినతిపత్రం అందజేశారు. కొన్ని బస్తీల్లో రోడ్లు సరిగా లేవని, ఇప్పటికీ కమ్యూనిటీ హాళ్లు లేవని, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక మంచినీటి నల్లాలలో మురికినీరు సరఫరా అవుతున్నాయని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరగా, ఎంపీ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహ్మద్ నయీమ్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు కల్పించండి



కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

ఖైరతాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగిసేలోపు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కలెక్టర్‌ను కోరారు. సోమవారం పార్టీ సెంట్రల్‌జోన్ సభ్యులు విజయ మల్లంగి, జావెద్ షరీఫ్, బాబూలాల్ పవార్ తదితరులు కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ డాక్టర్ జి.ముకుందరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. పాఠశాలల్లో కావాల్సిన సదుపాయాలను వివరించారు. తమ పార్టీ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను గుర్తించామని తెలిపారు. ఫిలింనగర్ రౌండ్‌టేబుల్ పాఠశాలతో పాటు హిమాయత్‌నగర్ పాఠశాలలో మరుగుదొడ్లు సరిగ్గాలేవని, సరిపడా ఆయమ్మలు లేక పరిసరాలు పరిశుభ్రంగా లేవని వారు తెలిపారు. పాఠశాలల ప్రారంభానికి ముందే మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరినట్టు విజయ తెలిపారు. పాఠశాల ప్రాంగణాల్లోకి సంఘవిద్రోహ శక్తులు రాకుండా చూడాలని, పాఠశాల స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చూడాలని కోరామని ఆమె పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సుధారాణి, షాబాజ్, లియాకత్, అజీంబేగ్ తదితరులు ఉన్నారు.

ఏఐ భూభాగంలో నైపుణ్యం పెంచేందుకు డిజైనతాన్



డిజైనతాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

బంజారాహిల్స్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సహాయంతో గ్రాఫిక్ డిజైనింగ్, ఎడిటింగ్, క్రియేటింగ్ అంశాలతో 12 గంటలపాటు నిర్వహించిన డిజైనతాన్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బంజారాహిల్స్‌లోని ఓ హోటల్లో కోర్స్ విటా ఆధ్వర్యంలో జరిగిన ఈ డిజైనతాన్‌లో పోర్టుఫోలియో బిల్డర్, జాబ్ సిమ్యులేషన్, క్విజ్ విటా లాంటి అంశాల్లో విద్యార్థులకు నైపుణ్యం కలిగిన నిపుణులు మెళకువలు నేర్పించారు. ఈ సందర్భంగా కోర్స్ విటా వ్యవస్థాపకుడు అర్జున్ వినయ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా డిజైనింగ్ రంగంలో పోటీ జరగడం ఇదే మొదటిసారి అని తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను తెలుసుకోవడంతోపాటు అందుబాటులోకి వస్తున్న కొత్త పరిజ్ఞానంపై అవగాహన కలిగించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు.



ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరించిన రాజశేఖర్, ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు

ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం

ఖైరతాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన ఖైరతాబాద్ విద్యార్థులను ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు సత్కరించి నగదు పురస్కారాలను అందజేశారు. సోమవారం గ్రంథాలయం వద్ద ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌తో పాటు ఉత్సవ కమిటీ ఛైర్మన్ సింగరి రాజ్‌కుమార్, కన్వీనర్ సందీప్‌రాజ్ ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను శాలువాతో సత్కరించి నగదు బహుమతులను అందజేశారు. విద్యార్థులు కష్టపడితేనే భవిష్యత్తులో ఉన్నతస్థానాలకు చేరుకుంటారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు వీణా మాధురి, బాల్‌కుమార్, నడికుడి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

బర్కత్‌పుర, మే 5 (ఆంధ్రజ్యోతి): హస్తినపురం కార్పొరేటర్ సుజాత నాయక్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిపై జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌కు ఫిర్యాదు చేసినట్లు గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్ చౌహాన్ తెలిపారు. న్యూఢిల్లీలో కార్పొరేటర్ సుజాతనాయక్‌తో కలిసి ఆయన ఫిర్యాదు చేసినట్లు సోమవారం తెలిపారు. ఆమెను పూర్తిగా అవమానిస్తూ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడిన తీరును కమిషన్ సభ్యులకు వివరించినట్లు చెప్పారు. న్యాయం జరిగేంత వరకు పోరాడుతామన్నారు. ఎమ్మెల్యేని అనర్హుడిగా ప్రకటించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు విచారించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నుంచి ఆయనను సస్పెండ్ చేయాలని కోరారు. త్వరలో గిరిజన సంఘాలతో కలిసి కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు.

అనారోగ్యంతోనే పవన్ మృతి

- విశ్వాసాన్ని చాటుకోబోయిన శునకం

యూసుఫ్‌గూడ, మే 5 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ ఈ- బ్లాక్ నివాసి దాసరి పవన్ కుమార్ అనుమానాస్పద మృతి కేసును మధురానగర్ పోలీసులు ఛేదించారు. శ్వాస సంబంధ వ్యాధితోనే పవన్ మృతి చెందినట్లు తేల్చారు. ఇన్‌స్పెక్టర్ ఎండీ షాకీర్ అలీ సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించి మృతికి గల కారణాలను తెలియజేశారు. పవన్ కుమార్ శ్వాస సంబంధిత వ్యాధితో మృతిచెందాడన్నారు. మృతిచెందిన అనంతరం యజమానితో పాటే నిద్రిస్తున్న శునకం అతడిని నిద్ర నుంచి లేపడానికి ప్రయత్నించింది. అందులో భాగంగానే మృతుడి శరీరంపై పలుచోట్ల గాయాలయ్యాయని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. పడకగదిలో విగతజీవిగా పడి ఉన్న యజమానిని రక్షించే ప్రయత్నంలో తన విశ్వాసాన్ని చాటుకోబోయిన శునకం హృదయ విదారక బాధ కనిపించిన తీరు కుటుంబసభ్యులను కన్నీరు పెట్టించిందని ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.

ఖైరతాబాద్ యాదవ సంఘం కార్యవర్గం రద్దు



యాదవ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సత్కరిస్తున్న యాదవులు

ఖైరతాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ యాదవ సంఘం కార్యవర్గాన్ని రద్దు చేశారు. ఖైరతాబాద్ మహాకాళి ఆలయంలో యాదవ సంఘం సభ్యులు సోమవారం సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. వయోభారం, ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న అధ్యక్షుడు బాలయ్య యాదవ్ తాను బాధ్యతలు నిర్వహించలేనని చెప్పడంతో ప్రధాన కార్యదర్శి మారయ్య యాదవ్‌తో పాటు కోశాధికారి లక్ష్మణ్ యాదవ్ సైతం బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. దీంతో పూర్తి కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు బాలయ్య యాదవ్ తెలిపారు. కొత్త కార్యవర్గాన్ని మే 11వ తేదీన ఎన్నుకుంటామని ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా చాలా సంవత్సరాల పాటు యాదవ సంఘానికి సేవలందించిన బాలయ్య యాదవ్, మారయ్య యాదవ్‌ను కులస్థులు సత్కరించారు. కార్యక్రమంలో యాదవ సంఘం ప్రతినిధులు లక్ష్మణ్ యాదవ్, రాము యాదవ్, ప్రవీణ్ యాదవ్, మల్లికార్జున్ యాదవ్, ఫకీరయ్య యాదవ్, భవాని కృష్ణ యాదవ్, రాజేందర్ యాదవ్, పాండు యాదవ్, శ్రీశైలం యాదవ్, పాండు యాదవ్ పాల్గొన్నారు.

శరీరతత్వానికి మంత్ర, జ్ఞాన, ధ్యాన సాధనలు అవసరం



వైశాఖ మాస సభలో విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం 9వ గురువు డాక్టర్ ఉమర్ అలీషా, ప్రతినిధులు

ఖైరతాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): శరీరతత్వానికి మంత్ర సాధన, మానసిక తత్వానికి జ్ఞాన సాధన, ఆత్మ తత్వానికి ధ్యాన సాధనలు అవసరమని శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా, ఆధ్యాత్మిక పీఠం 9వ పీఠాధిపతి సద్గురు డాక్టర్ ఉమర్ అలీషా అన్నారు. పీఠం హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ వాసవీ కల్యాణ మండపంలో వైశాఖ మాస సభ జరిగింది. ఇందులో ఎయిర్ మార్షల్ బి.చంద్రశేఖర్, విశ్రాంత ఐఏఎస్ డాక్టర్ దాసరి శ్రీనివాసులు, విశ్రాంత జిల్లా జడ్జి బి.నాగమారుతీ శర్మ తదితరులతో కలిసి పాల్గొన్న ఉమర్ అలీషా ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను, కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ మూడు మొక్కలను నాటి 'నా మొక్క.. నా శ్వాస' అనే నినాదంతో ముందుకెళ్లాలని సూచించారు. అనంతరం బాల వికాస్, యువ వికాస్ ప్రతినిధులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆదాయపు పన్ను శాఖ అధికారి రామావతారం, జీవీకే ఇండస్ట్రీస్ సీఈవో కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మదర్స్ డేను పురస్కరించుకొని 11న 5కె, 3కె, 2కె రన్

పంజాగుట్ట, మే 5 (ఆంధ్రజ్యోతి): వృక్షాధామ ఫౌండేషన్, సిమీస్ వరల్డ్, వివిధ సంస్థల సహకారంతో మదర్స్ డేను పురస్కరించుకొని ఈనెల 11న గచ్చిబౌలి స్టేడియంలో 5కె, 3కె, 2కె రన్ నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ఫౌండర్ కళ్యాణి బెల్లంకొండ తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 5కె, 3కె, 2కె రన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమెరికాలో ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశామని, దేశంలో రోజు రోజుకూ తరిగిపోతున్న వృక్ష సంపదను కాపాడేందుకు, పర్యావరణంలో వృక్షాల ఆవశ్యకతను ప్రజలకు తెలియజేసేందుకు రన్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మురళి చదలవాడ, డాక్టర్ శ్రీపూజ సిద్ధంశెట్టి, చిన్నారులు దక్షిత, నిత్య సంతోషి, ప్రణీత దేవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బంగారు పతకాలు సాధించిన నాగజ్యోతి, మిశ్రాలను సన్మానిస్తున్న రమేష్‌గౌడ్

పవర్ లిఫ్టింగ్ విజేతలకు సన్మానం

హైదరాబాద్ సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఓల్డ్ బోయిన్‌పల్లిలో ఇటీవల జరిగిన తెలంగాణ స్టేట్ ఎక్విపిడ్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మహిళల విభాగంలో సీనియర్ మహిళ జట్టులో నాగజ్యోతి, పురుషుల జట్టులో మిశ్రా(60 ఏళ్లు) బంగారు పతకాలు సాధించారు. వీరిని బీకేగూడలోని యాష్ జిమ్‌లో తెలంగాణ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి రమేష్‌గౌడ్ సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా రమేష్‌గౌడ్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి ఎప్పుడూ ప్రోత్సాహం ఉంటుందని పేర్కొన్నారు.

వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదినం రేపు

బోరబండ, మే 5 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్ సంతోష్‌గిరి శ్రీ సంతోషిమాత ఆలయ ప్రాంగణంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదినాన్ని బుధవారం నిర్వహించనున్నారు. రహ్మత్‌నగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేకం, అలంకరణ, కుంకుమార్చన, యజ్ఞ కార్యక్రమాలు జరుగుతాయని సంఘం అధ్యక్షుడు నిజామాబాద్ శ్రీనివాస్ తెలిపారు. భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని ఆయన తెలిపారు.

ఈబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

దుండిగల్, మే 5 (ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణాల్లోని పేదల అభ్యున్నతికి ఈబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఈబీసీ సంక్షేమ సంఘం కేంద్ర కమిటీ సభ్యులు గవర్నర్‌కు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఈబీసీ విద్యార్థులకు సైతం వర్తింపచేలా చూడాలని, కేంద్రంలోనూ జాతీయ ఈబీసీ కార్పొరేషన్, వెల్ఫేర్ డిపార్టుమెంట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఓసీ కులాల ఆత్మగౌరవం, ఆత్మాభిమానం దెబ్బతీసే విధంగా దూషించే వారిపై ప్రభుత్వం సుమోటోగా తీసుకొని కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవిశంకర్‌రావు, జనార్దన్, యాదగిరిరావు, రమణారావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న డౌటన్ బజారు వాసులు

పెండింగ్ పనులను పూర్తిచేయాలి

అడ్డగుట్ట, మే 5 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ నియోజకవర్గం బొల్లారం డౌటన్‌బజారులో అమరావతి కో-ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ స్నేహ ఎన్‌క్లేవ్ కాలనీలోని పార్కు కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉందని, పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ఎమ్మెల్యే పార్కు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాలనీ అధ్యక్షుడు జైహింద్‌రావు, కార్యదర్శి విజయ్‌కుమార్, సలహాదారుడు నర్సింగ్‌రావు, గౌరవ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, ఉపాధ్యక్షుడు యాదగిరి, కోశాధికారి కృష్ణారావు, సంయుక్త కార్యదర్శి నర్సింహారెడ్డిలతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

ఆడపిల్లలకు అండగా కల్యాణలక్ష్మి పథకం

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సహాయం అందిస్తున్న మొదటి రాష్ట్రం తెలంగాణ అని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం వెస్ట్ మారేడుపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో 38 మంది లబ్ధిదారులకు 13 కల్యాణలక్ష్మి, 25 షాదీ ముబారక్‌ల కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డ పెళ్లి చేయడానికి పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అప్పటి సీఎం కేసీఆర్ ఒక లక్ష 116 రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందించే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలన్ లక్ష్మి, టి.మహేశ్వరి, కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్లు శేషుకుమారి, మల్లికార్జున్ గౌడ్, డివిజన్ల నాయకులు బాల్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, వెంకటేషన్ రాజు, బాలానగర్, సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

మారేడుపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి) : మహేంద్ర హిల్స్ రవి కాలనీ, ధనలక్ష్మీ కాలనీ, శాంతినికేతన్ సొసైటీ తదితర కాలనీల్లో తాగునీరు సరిపోయినంతగా సరఫరా కాకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని రవికాలనీ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు కొత్త సంజీవరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. తాగునీరు సరిగా సరఫరా కాకపోవడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సొసైటీల ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న సంజీవరెడ్డి



సీఐ శ్రీకాంత్‌రెడ్డిని కలిసిన రుద్రవీణ మహిళ సంఘం ప్రతినిధులు

గంజాయితో కలిగే నష్టాలపై అవగాహన

అడ్డగుట్ట, మే 5 (ఆంధ్రజ్యోతి) : గంజాయి నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బస్తీలో సదస్సు నిర్వహించాలని రుద్రవీణ మహిళా సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎన్.శోభ సూచించారు. రెండు రోజుల క్రితం తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో సీఐని సోమవారం కలిసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడ్డగుట్ట డివిజన్‌లో యువత గంజాయి సేవించి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, గంజాయి విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గంజాయి తాగడం వల్ల కలిగే నష్టంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి బస్తీలో తుకారాంగేట్ పోలీసులు అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహించాలని పోలీసులను కోరారు. సీఐని కలిసిన వారిలో సంఘం సభ్యురాళ్లు నాగరాణి, పద్మ, శ్యామల, మహాలక్ష్మి, సురేఖ, విజయలక్ష్మి, శిరీష, కృష్ణవేణి, మనీషా, నస్రీన్‌బేగం, శోభ రేచల్‌లు పాల్గొన్నారు.



సీఐని కలిసిన జై భీమ్ మాల మహాసంఘం ప్రతినిధులు

సీఐ, డీఐలకు సన్మానం

అడ్డగుట్ట, మే 5 (ఆంధ్రజ్యోతి) : తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్‌రెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్‌లను సోమవారం జైభీం మాల మహాసంఘం ప్రతినిధులు ఆర్ మల్లేష్, నక్కా మధు ఆధ్వర్యంలో సన్మానం చేశారు. తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న పలు సమస్యలపై, ఎక్కడెక్కడ ఎలాంటి సమస్యాత్మకమైన ప్రాంతాలు ఉన్నాయనే విషయాలపై సీఐ, డీఐలకు సూచించారు. వీరిని కలిసిన వారిలో కోటేశ్వర్‌రావు, శివకుమార్, జైకుమార్, రాంచందర్, శ్రీనివాస్, అమర్, మహేందర్, యాదగిరి, రమాదేవి, శోభ, ఉమ, మహాలక్ష్మి జయకుమార్, బాన్సోడే, రమాదేవి, ప్రసన్నలక్ష్మి, ఉమ, రమలు ఉన్నారు.

తిరుమలగిరి చెరువు

కాలుష్య కాసారం

పట్టించుకోని అధికారులు



తిరుమలగిరి చెరువు

తిరుమలగిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు తిరుమలగిరి ప్రాంత వాసులకు తాగునీరు అందించిన తిరుమలగిరి చెరువు ప్రస్తుతం కాలుష్య కాసారంగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ విషయమై పరిసర ప్రాంత కాలనీ వాసులు గతంలో ఆందోళనలు కూడా చేశారు. అప్పట్లో పరిసర ప్రాంతాల్లో బోర్‌వెల్స్ లేవు. తిరుమలగిరి చెరువు నుంచి మాత్రమే తాగునీరు తీసుకుని వెళ్లేవారు. ప్రస్తుతం నేరుగా చెరువులోకి డ్రైనేజీ నీరు వెళ్లడంతో పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. తిరుమలగిరి మండల అధికారులు, కంటోన్మెంట్ అధికారులకు చెరువును శుభ్రపరచాలని స్థానికులు ఎన్నోసార్లు విన్నవించారు. అధికారులు పట్టించుకోకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాయంత్రం అయిందంటే తీవ్ర దుర్గంధం, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో స్థానికులకు కంటిమీద కునుకు లేకుండాపోతుంది. జనావాసాల మధ్య మురికికూపంగా మారిన చెరువును ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని గురించి పలుమార్లు చెరువు గట్టుపై ఆందోళనలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. కంటోన్మెంటు అధికారులు టూరిజం శాఖ ఆధ్వర్యంలో చెరువుకు సుందరీకరణ పనులు చేపడతామని హామీ ఇచ్చినా పనులు సాగకపోవడంతో స్థానిక కాలనీవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సుందరీకరణ పనులు చేపడతామని అధికారులు ప్రకటించిన నేపథ్యంలో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. కానీ ఇప్పటివరకు ప్రకటనల వరకే పరిమితం అయ్యాయని సుందరీకరణ పనులు మాత్రం సాగడం లేదంటూ సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కుచించుకుపోతున్న చెరువు

సర్వే నంబర్ 118 తిరుమలగిరి చెరువు పరిసర ప్రాంతాలు ఎఫ్‌టీఎల్ బఫర్‌జోన్‌లోని స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని స్థానిక కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పాలసముద్రం లాగా కనిపించిన చెరువు ప్రస్తుతం కబ్జా కోరల్లో చిక్కుకుని తుంగ, పిచ్చి మొక్కలు, చెట్లతో కనిపిస్తుంది. కొందరు స్థలాలను ఆక్రమించుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెవెన్యూ, కంటోన్మెంటు, టూరిజం శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పర్యటించి చెరువును కాపాడాలని పలువురు కోరుతున్నారు.

కబ్జాలను తొలగించాలి



చెరువు పూర్తిగా కబ్జా కోరల్లో రోజు రోజుకు కుచించుకుపోతోంది. దీంతో చెరువులోని నీరు పూర్తిగా మురికి కూపంగా మారుతున్నాయి. చెరువును సుందరీకరణ చేయడంతో పాటు చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్‌ను నిర్మించి ఫెన్సింగ్‌ను వేయాలి. అధికారులు చెరువును ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ ఉండాలి. లేని ఎడల కబ్జారాయుళ్లు చెరువును పూర్తిగా మింగేస్తారు.

- గుంటుపల్లి సత్తయ్య, మలాని కాలనీ

ప్రక్షాళన చేయాలి



చెరువును అందంగా తీర్చిదిద్దడానికి అధికారులు చొరవ చూపాలి. బ్యూటిఫికేషన్‌లో బాగంగా అందమైన మొక్కలు, పూలమొక్కలను చెరువు చుట్టూ ఏర్పాటు చేసి చుట్టుపక్కల కాలనీ వాసులు వాకింగ్ చేసుకోవడానికి ట్రాక్‌ను నిర్మించాలి. లేకపోతే చెరువును కబ్జాకు గురయ్యే అవకాశం ఉంది. కబ్జారాయుళ్లపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

- సాహితి, మలాని కాలనీ

ప్రజలకు సేవ చేసేది కాంగ్రెస్ పార్టీయే

● సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్, చిత్రంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, పర్యవేక్షకుడు లక్ష్మారెడ్డి తదితరులు

బౌద్ధనగర్, మే 5(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు సేవ చేసేది కాంగ్రెస్ పార్టీయేనని సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ అన్నారు. నామాలగుండు బీఎస్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయనతో పాటు రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే, అసెంబ్లీ పర్యవేక్షకుడు లక్ష్మారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. అనంతరం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల అమలుతో ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో పార్టీ పటిష్టత కోసం చేయాల్సిన కార్యక్రమాలపై చర్చించడం జరుగుతుందని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం, పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలని అన్నారు. బూత్‌స్థాయి కార్యకర్తలు టార్గెట్‌లు పెట్టుకుని పనిచేయాలని ఆదం సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమర్‌నాథ్ గౌడ్, సందీప్‌రాజ్, షకీల్‌ఖాన్, జలంధర్‌రెడ్డి, కిషోర్‌యాదవ్, అనిల్‌కుమార్, అభిషేక్, రవి, బ్రహ్మాజీ, గంటరాజు తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహికులకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరం

సీఐటీడీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



సీఐటీడీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తల 'ర్యాంప్' అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డైరెక్టరేట్ ఆఫ్ ఇండస్ట్రీస్ జాయింట్ డైరెక్టర్ మధుకర్ బాబు

కుషాయిగూడ, మే 5 (ఆంధ్రజ్యోతి): మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పారిశ్రామిక వేత్తలు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కమిషనరేట్ ఆఫ్ ఇండస్ట్రీస్ జాయింట్ డైరెక్టర్ కె.మధుకర్ బాబు పేర్కొన్నారు. సోమవారం చర్లపల్లి సీఐఏ హాల్‌లో ఎంఎస్‌ఎంఈ విభాగమైన శిక్షణా సంస్థ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ) ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐటీడీ ప్రస్తుతం చేపట్టిన రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పర్ఫార్మెన్స్(ర్యాంప్) పథకం గురించి వివరించారు. సీఐటీడీ ప్రిన్సిపల్ డైరెక్టర్ డాక్టర్ టి.విజయ్ క్రిష్ణకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్యవిభాగం పర్యవేక్షణలో స్టేట్ ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్(ఎస్‌పీఐయూ), గ్రాంట్ థాంప్టన్ భారత్ ఎల్ఎల్‌పీ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ సెంటర్(డీఐసీ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ అవగాహన తరగతుల గురించి తెలిపారు. గ్రాంట్ థాంప్టన్ భారత్ ఎల్ఎల్‌పీ అసోసియేట్ డైరెక్టర్ మహ్మద్ జైదీ 'ర్యాంప్'కు చెందిన వివిధ అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో చర్లపల్లి పారిశ్రామికవాడకు చెందిన 'ఐలా' చైర్మన్ జె.రోషిరెడ్డి, కార్యదర్శి కె.చంద్రశేఖర్‌రెడ్డి, కాప్రా సూక్ష్మ పరిశ్రమల యజమానుల సంఘం అధ్యక్షుడు డి.యాదయ్య యాదవ్, ప్రధానకార్యదర్శి కశువజ్జుల విద్యాసాగర్, దళిత పారిశ్రామిక వేత్తల సంఘం ప్రధానకార్యదర్శి సీహెచ్.బాబురావు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

● ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మచ్చబొల్లారం, మే 5 (ఆంధ్రజ్యోతి): మౌలిక వసతుల ఏర్పాటుకు నిరంతరం కృషి చేస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం మచ్చబొల్లారం డివిజన్ లక్ష్మమ్మ ఎన్‌క్లేవ్‌లో రూ.50 లక్షల వ్యయంతో కూడిన సీసీరోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా రోడ్డును నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు జైపాల్ రెడ్డి, నందీశ్వర్ రెడ్డి, వెంకటరమణ, కాలేష్, గోపాల్ విష్ణువర్ధన్, రాజేష్, బీఆర్‌ఎస్ నాయకులు జోలి రమేష్, శోభన్, లక్ష్మణ్ యాదవ్, పవన్, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి



మయాంక్ (ఫైల్)

మల్కాజ్‌గిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించడంతో ఆత్మహత్యకు యత్నించిన ఓ యువకుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించాడు. ఈ సంఘటన మల్కాజ్‌గిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. భవానీనగర్‌కు చెందిన గొట్టం మల్లేష్(45) సెంట్రింగ్ వర్కర్. ఆయన కుమారుడు గొట్టం మయాంక్(18) తరచూ ఓ అమ్మాయితో ఫోన్లో మాట్లాడుతూ చదువుకోలేకపోతున్నట్లు తండ్రి గ్రహించాడు. గత మార్చి 6న కుమారుడిని మందలించాడు. దీంతో తల్లిదండ్రులు ఇంటిలో లేని సమయంలో నోస్‌డ్రాప్స్‌ను మింగి కిందపడిపోయాడు. ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు కుమారుడిని చూసి చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి అనంతరం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అప్పటినుంచి చికిత్సపొందుతున్న మయాంక్ ఆదివారం రాత్రి మృతిచెందాడు. తండ్రి ఫిర్యాదుతో పోలీసులు కేసునమోదుచేసుకుని దర్యాప్తుచేస్తున్నారు.



పూజలు చేస్తున్న అర్చకులు

ఘనంగా శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

మచ్చబొల్లారం, మే 5 (ఆంధ్రజ్యోతి): అల్వాల్ పట్టణం మచ్చబొల్లారం డివిజన్ శ్రీసాయి సూర్య ఎంక్లేవ్, ఫేస్ -2లో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి సమేత నగరేశ్వర స్వామి దేవస్థానం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం (రెండో రోజు) ఆలయంలో విగ్రహ శోభాయాత్ర, జలాధివాస ఉత్థాపన, చండీ హోమం, దాన్యాధివాసం, అన్నప్రసాద వితరణ జరిపారు. నిత్యం చతుర్వేద పారాయణం, రామాయణం, శ్రీమత్భాగవత పారాయణం జరుగుతాయని, కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని ఆలయ ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సిరిపురం ఆనందబాబు, ప్రొద్దుటూరు నాగేశ్వరరావు, అమర శ్రీను, ఉప్పల రాంబాబు, గంగాధర్ పెద్ది రమేష్, శివ, ఆలయ ధర్మకర్తలు, జీవిత సభ్యులు, దాతలు, తదితరులు పాల్గొన్నారు.

పని చేసే ఇంటికి కన్నం.. మహిళ అరెస్టు

బోయినపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి) : పని చేస్తున్న యాజమాని ఇంటికి కన్నం వేసిన ఓ మహిళను అరెస్టు చేసిన ఘటన బోయినపల్లిలో జరిగింది. బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, డీఐ సర్దార్ నాయక్‌లు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా దుగ్గిరాలకు చెందిన కంచర్ల సువర్ణ(48) జగద్గిరిగుట్టలో నివాసం ఉంటుంది. ఆరు నెలల క్రితం బోయినపల్లి ఆనంద్‌నగర్ కాలనీలోని శివరాంకృష్ణ ఇంటిలో కేర్ టేకర్‌తోపాటు, పనిమనిషిగా చేరింది. ఈ క్రమంలో శనివారం ఇంటిలో ఎవరు లేని సమయంలో సదరు వృద్ధురాలు నిద్రిస్తుండగా అర్థరాత్రి ఇంటిలో ఉన్న బంగారు నగలతో పాటు ఓ సెల్‌ఫోన్‌ను దొంగిలించింది. దీంతో ఆదివారం విషయం తెలుసుకున్న ఇంటి యాజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న క్రైమ్ పోలీసులు ఎస్ఐ తుల్జారాం ఆధ్వర్యంలో దర్యాప్తు మొదలు పెట్టారు. సెల్‌ఫోన్ కాల్‌డేటా ఆధారంగా ఆమె జగద్గిరిగుట్టలోని బంధువు ఇంటిలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకుని సోమవారం బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆమె నుంచి సుమారు రూ.8 లక్షల 20 వేలు విలువ చేసే బంగారు ఆభరణాలు, ఓ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. 24 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులను డీసీపీ రష్మీ పెరుమాళ్, ఏసీపీ గోపాల కృష్ణమూర్తిలు అభినందించారు.



మహిళ వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు



ఆర్య సమాజ్‌లో పర్యటిస్తున్న జంపన ప్రతాప్

అధికారులు దృష్టి సారిస్తే సమస్యలకు పరిష్కారం

బోయినపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి) : అధికారులు దృష్టి సారిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ అన్నారు. ఇటీవల న్యూ బోయినపల్లిలోని పలు బస్తీల్లో నెలకొని ఉన్న సమస్యలను మీడియా ద్వారా కంటోన్మెంట్ బోర్డు సీఈఓ బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఆర్య సమాజ్ వద్ద లక్షా యాభైవేల రూపాయల వ్యయంతో విద్యుత్ మోటర్‌ను అధికారులు మార్చారు. నూతనంగా పైప్‌లైన్లు పది నల్లాలు వేసి నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించారు. ఈ క్రమంలో సోమవారం బస్తీలో పర్యటించిన జంపన్న ప్రతాప్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. సమస్యలు ఉన్న ప్రాంతాల్లో అధికారులు స్పందిస్తే సమస్యలు పరిష్కారమవుతాయని అనడానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు బస్తీ వాసులు పాల్గొన్నారు.



ఉండేటి సచిన్‌కు దళితరత్న అవార్డును అందజేస్తున్న రాజు ఉస్తాద్

ఉండేటి సచిన్‌కు దళితరత్న అవార్డు

బౌద్ధనగర్, మే5(ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఉండేటి సచిన్‌కు దళితరత్న అవార్డు లభించింది. దళిత కులాల హక్కుల పోరాట సమితి యూత్ అధ్యక్షుడిగా సేవలందిస్తున్న సచిన్‌కు సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ భవన్‌లో జాతీయ కులాల హక్కుల రక్షణ పోరాట సమితి అధ్యక్షుడు రాజు ఉస్తాద్ దళితరత్న అవార్డును ప్రదానం చేశారు. ఈ అవార్డుతో బాధ్యత పెరిగిందని, దళిత కులాల సంక్షేమానికి పాటుపడతానని, వారి హక్కుల కోసం పోరాడతానని సచిన్ తెలిపారు.

వారాసిగూడ ఇన్‌స్పెక్టర్‌గా మధుసూదన్‌రెడ్డి



మధుసూదన్‌రెడ్డి

బౌద్ధనగర్, మే 5(ఆంధ్రజ్యోతి): వారాసిగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా అరకల మధుసూదన్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఆయన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా చాంద్రాయణగుట్ట, ఇన్‌స్పెక్టర్‌గా రెయిన్‌బజార్, డీఐగా బేగంబజార్ పోలీస్‌స్టేషన్లో పనిచేశారు. బేగంబజార్ నుంచి బదిలీపై వారాసిగూడ పీఎస్‌కు వచ్చారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కాలనీలు, అపార్ట్‌మెంట్‌లు, బస్తీవాసులతో సమావేశాలు నిర్వహించి సీసీ కెమెరాల ఉపయోగంపై అవగాహన కల్పిస్తామన్నారు. ముఖ్యకూడళ్లలో పెట్రోలింగ్‌ను పెంచుతామన్నారు.

నేడు ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో కోట నీలిమ పర్యటన

బేగంపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమ పర్యటించనున్నట్లు పార్టీ సీనియర్ నాయకులు విశాల్ సుదాం తెలిపారు. పేద ప్రజల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో నీలిమ పాల్గొని కార్డుదారులకు బియ్యాన్ని పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు.



చలో అంబర్‌పేట్ బస్సు ర్యాలీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుప్రియ

నరేంద్ర మోదీతోనే దేశం అభివృద్ధి

● కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్

ముషీరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్రమోదీ హయాంలోనే దేశం అన్ని విధాలా అభివృద్ధి చెందుతున్నదని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ వార్డ్ కార్యాలయం నుంచి అంబర్‌పేట ఫ్లైఓవర్ ప్రారంభోత్సవానికి, అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభకు బస్సులలో ర్యాలీగా తరలివెళ్లారు. ఈ ర్యాలీని కార్పొరేటర్ సుప్రియ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, నితిన్ గడ్కారీలు అభివృద్ధి పనులకు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, పార్టీ నాయకులు జమాల్‌పురి నందు, అనిల్ కుమార్, లక్ష్మణ్, మెట్టు వాసు, బాలకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.